క్లుప్తంగా

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి చౌరస్తా సమీపంలో విద్యుత్ లైను మార్చుతున్న కారణంగా గోపి నగర్, కృష్ణారెడ్డి నగర్, గురు రాఘవేంద్ర నగర్, నిర్మల్ నగర్, గీత నగర్, జంగాల కొట్టాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 వరకు, సంతోష్ నగర్ సెక్షన్ పరిధిలోని బాలాజీ నగర్, బావాపురం, సంతోష్‌నగర్, ఎన్‌హెచ్44 ఏరియా, జి.శింగవరం, నిడ్జూరు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

22, 23న రాజకీయ శిక్షణ తరగతులు

కర్నూలు(సెంట్రల్): పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిళ్లను ఈ నెల 22, 23 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎండీ రఫీక్, కె.నాగరాజు తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కాషాయీకరణపై పోరుబాట పట్టనున్నట్లు చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశంలో విద్యను పేదలకు కేంద్ర ప్రభుత్వం దూరం చేస్తోందదన్నారు. సమావేశంలో నాయకులు మనోహర్, విజేంద్ర, పవన్ పాల్గొన్నారు.

సీమ హక్కుల సాధనకు ఉద్యమించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు సిటీ: రాయలసీమ హక్కుల సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ సూచించారు. ఆర్‌వీపీఎస్ ఆధ్వర్యంలో విద్యాలయాల్లో చేపట్టనున్న మన రాయలసీమ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం నగరంలోని ఓ కాలేజీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం అమలు చేసుకునేందుకు, రాజధాని సాధన కోసం, గుండ్రేవుల, సిద్దేశ్వర్యం అలుగు, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదావతి ప్రాజెక్టు సాధన కోసం విద్యార్థులతో పాటు, యువత ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అలాగే హక్కుల సాధనకు ఈనెల 28న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి భారీగా యువత తరలిరావాలన్నారు. సంఘం నాయకులు అశోక్, కిశోర్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలోని వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. వసతి గృహాలకు సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కమాటీ, ఇతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను పెంచాలన్నారు. అన్ని వసతి గృహాలకు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. అనంతరం డీఆర్వో ఎస్వీ నాగేశ్వర రావుకు వినతిపత్రం సమర్పించారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ విఘాతం

కర్నూలు(హాస్పిటల్): పర్యావరణానికి ప్లాస్టిక్‌తో పెను విఘాతం కలుగుతోందని, ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగ్‌లకు దూరంగా ఉండాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు..నార సంచులే ముద్దు అంటూ మంగళవారం కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ రహిత బ్యాగ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నేరుగా, చెత్తతో కలిపి కాల్చడం వల్ల డయాక్సిన్లు, ఫ్యూరాన్లు అనే క్యాన్సర్ కారక వాయువులు వెలువడుతాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కుంటలు, చెరువు, నదులు, సముద్ర జలాల్లోకి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు: నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 31 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని, వారి వాహనాలను సీజ్ చేసి కొత్తపేట వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రూ.63,085 అపరాధ రుసుం విధించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20, 35వ వార్డులలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. అక్కడ పరిష్కారం కాకుండా, ఇంకా ఏమైనా సమస్యలున్నా సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామన్నారు. అలాగే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పైసా ఖర్చు లేకుండా, తక్కువ సమయంలోనే అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిఒక్క కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చినట్లు వివరించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. రానున్న ఎన్నికల్లో మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, మాధురి, లక్ష్మిరెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు యాదవ్, వీరయ్య, యూనుస్ బాషా తదితరులు పాల్గొన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శరీన్‌నగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష పథకం నోడల్ ఆఫీసర్, డీఈ గోపాల కృష్ణ, స్పెషల్ ఆఫీసర్ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

కష్ట కాలంలో..

ఈమె పేరు శ్యామల. ఇందిరమ్మ కాలనీలోని 45వ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తోంది. కరోనా సమయంలో లాక్ డౌన్‌తో దుకాణాలు మూతపడ్డాయి. తిండి గింజలు కూడా దొరకని స్థితి ఏర్పడింది. అలాంటి సమయంలో వలంటీర్ జిల్లా అధికారులతో అనుమతి తీసుకొని కరోనా వేళ ధైర్యంగా ఇంటింటికి తిరిగారు. తన పరిధిలోని రేషన్ కార్డులున్న పేదలందరికీ రేషన్ డిపో వద్ద కూర్చొని రేషన్ సరుకులు అందజేశారు. సొంత వారు సైతం కరోనా వేళలో దూరంగా ఉన్నా వలంటీర్ మాత్రం నిరాటంకంగా పేదలకు సేవలందించారు.

– కర్నూలు టౌన్



రేషన్ పంపిణీ కోసం లబ్ధిదారుడి నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ శ్యామల

సేవలు మరువం



కరోనా సమయంలో పనులు లేవు. దుకాణాలన్నీ మూసేశారు. బంధువులు కూడా ఒకరింటికి మరొకరు రావడం లేదు. అలాంటి సమయంలో మా వలంటీర్ శ్యామల ఇంటింటికి తిరిగేది. మాస్కులు, గ్లౌజ్‌లు వేసుకొని బియ్యం పంపిణీ చేసి మమ్మల్ని ఆదుకుంది. కష్టకాలంలో ఆమె చేసిన సేవలు మరువం.

– బోయ రాజు, కాలనీవాసి

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలించాలి

- పాణ్యం నియోజకవర్గ బీఎల్‌ఓల శిక్షణలో జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై పాణ్యం నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఇంకా ఎంతమంది ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందనే వివరాలను సేకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇల్లు లేనివారు, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. జిల్లాకు కొత్తగా ఓటరు కార్డులు వచ్చాయని, పోస్టాఫీసుల ద్వారా వాటిని ఓటర్లకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోరుకల్లు ప్రాజెక్టు నిర్వాసితులు సుగాలి మెట్టలో నివాసం ఉండడంతో అక్కడ ఫారం–8 ద్వారా ఓటు హక్కు కల్పించాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,500 మంది మాత్రమే ఓటర్లు ఉండాలని, అంతకంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే వారిని రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న కేంద్రానికి బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఓర్వకల్లు, కల్లూరు, గడివేముల, పాణ్యం తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు(రూరల్): క్రీడాకారులు రాష్ట్రస్థాయి రోప్ స్కిపింగ్ పోటీల్లో రాణించాలని డాక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో రోప్ స్కిపింగ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

సంతాపం

కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త సెక్షన్ ఆఫీసర్ వడ్డే ప్రసాదు మృతికి చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, రిజిస్ట్రార్ టి.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ నరసింహారెడ్డి సంతాపం ప్రకటించారు. ఈనెల 14న తెల్లవారుజామును గుండెపోటుతో వి.ప్రసాదు(57) మరణించారు. మంగళవారం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి చైర్మన్‌తోపాటు ఉద్యోగులు పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఉమెన్‌చాందీ మృతి పార్టీకి తీరని లోటు

కర్నూలు(రూరల్): కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్‌చాందీ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డీసీసీ అధ్యక్షులు సుధాకర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమెన్ చాందీ మృతి పట్ల ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం జెడ్పీలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం టీడీపీ సర్పంచులు మాట్లాడుతూ పక్షపాతం చూపుతూ తమ గ్రామాలకు నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. స్పందించిన ఎంపీపీ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న తమ ప్రభుత్వంపై అభాండాలు వేయడం తగదన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఒక్కో ఎంపీటీసీకి రూ.3 లక్షలు ఇస్తే టీడీపీకి చెందిన సర్పంచులు తీర్మానాలు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. బీ.తాండ్రపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రెండు సచివాలయాలకు రూ.40 లక్షల నిధులిస్తే టీడీపీ సర్పంచ్ జయన్న తీర్మానం ఇవ్వలేదన్నారు. బసవాపురం గ్రామాభివృద్ధికి రూ.40 లక్షలు ఎంపీ నిధులు, రూ.20 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులిస్తే టీడీపీ సర్పంచ్ కురువ గిడ్డయ్య తీర్మానం ఇవ్వలేదన్నారు. ఏనాడూ తమ గ్రామానికి నిధులు ఇవ్వాలని అడగకపోవడంతో పాటు ఇచ్చిన నిధులను కూడా వాడుకోకుండా ప్రభుత్వంపై నెట్టడం సరికాదన్నారు. దిన్నెదేవరపాడు జగన్నాథగట్టుపై తాగునీటి బోరు పక్కన ఎర్రమట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలని ఎంపీటీసీ బోయ మద్దిలేటి, సర్పంచ్ మాధవస్వామి సభ దృష్టికి తెచ్చారు. బీ తాండ్రపాడు గ్రామంలో ఇంటింటికి బియ్యం పంపిణీ సక్రమంగా సరఫరా చేయడం లేదని సర్పంచ్ జయన్న, ఎంపీటీసీ సభ్యుడు మద్దిలేటి సభ దృష్టికి తీసుకువచ్చారు. రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు స్పందిస్తూ ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి వెళ్లి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని, ఇంటింటికి బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కర్నూలు వైస్ ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి పాల్గొన్నారు.

ఖానా ఖజానాకు స్పందన



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): స్థానిక బిర్లాగేట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేయనున్న ఖానా ఖజానా (ఈట్ స్ట్రీట్)కు వ్యాపారుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇక్కడ వ్యాపారం కోసం ఇప్పటికే నగరపాలక టెండర్లను ఆహ్వానించింది. బుధవారం పలువురు చిరు వ్యాపారులు మేనేజర్ చిన్నరాముడును కలిసి దరఖాస్తులను అందజేశారు. నగర ప్రజల ఆహ్లాదం కోసం రూ.2 కోట్లు వెచ్చించి ఖానా ఖజానాను ఇటీవల నగరపాలక ఇంజినీరింగ్ విభాగం పూర్తి చేసింది. ప్రజలకు, యువతకు, పిల్లల కోసం ఇక్కడే ఛాట్ బండార్, పిజ్జా బర్గర్ యూనిట్లు, ఐస్ పార్లర్, శాఖా, ఫలహార శాల, బిర్యానీ పాయింట్, జ్యూస్ సెంటర్, కాఫీ, టీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ వ్యాపారం చేయదలిచే వారు రూ.30 వేలు దరావత్తు చెల్లించాలని, దరఖాస్తులను ఈనెల 22వ తేదీ సాయంత్రం వరకు స్వీకరిస్తామన్నారు. ఈనెల 25న నగరపాలక కౌన్సిల్ హాలులో అధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

కళాశాల హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



జేడీకి వినతి పత్రం అందిస్తున్న హెచ్‌డబ్ల్యూఓలు

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కళాశాల వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని హెచ్‌డబ్ల్యూఓలు ఎం వెంకటరెడ్డి, సుంకన్న, నాగమద్దయ్య, బెన్నమ్మ, కవిత, శిరీష తదితరులు మంగళవారం జేడీ రంగలక్ష్మీదేవిని కలిసి వినతి పత్రం అందించారు. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రాముల పరిమాణంలో ఆహార పదార్థాలను అందించాలని తెలియజేయడం వల్ల మెనూ అమలు చేయడం కష్టసాధ్యంగా ఉందని, నాల్గవ తరగతి సిబ్బంది లేకపోవడంతో విద్యార్థుల మెనూకు కేటాయించిన రూ.1600 ల్లోనే ముగ్గురు సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జేడీని కోరారు.

టీసీ లక్ష్మమ్మ ఆశయాలు కొనసాగిద్దాం

కర్నూలు (రూరల్): కామ్రేడ్ టీసీ లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణ తెలిపారు. మంగళవారం నగరంలోని వివిధ వార్డులలో టీసీ లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. మహిళాభివృద్ధికి లక్ష్మమ్మ చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సుజాత, సావిత్రమ్మ, జమున, లక్ష్మి, భాగ్యమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

పసుపులలో కార్డెన్ సెర్చ్



పసుపుల గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కర్నూలు: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్, ఎస్ఐలు బాలనరసింహ, రామకృష్ణతో పాటు 50 మంది సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు పసుపుల గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామునే గ్రామాన్ని జల్లెడ పట్టారు. సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామ శివారులోని నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. తయారీదారులు, విక్రయదారులను అదుపులోకి తీసుకుని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను, 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 1,200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఇకపై నాటుసారా తయారీ విక్రయాలు చేయబోమని, గౌరవప్రదమైన జీవితం గడుపుతామని వారి చేత ప్రమాణం చేయించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు.

సబ్సిడీ టమాటా పంపిణీ



అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజారులో టమాట కోసం వరుసలో నిలబడిన వినియోగదారులు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని రైతు బజార్లలో వినియోగదారులకు మంగళవారం సబ్సిడీ టమాటాలను పంపిణీ చేశారు. బయట మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి రూ.150 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంతో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వినియోగదారులకు సబ్సిడీపై కిలో టమాట రూ.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లి నుంచి 240 బాక్సుల టమాటాలను కొనుగోలు చేసి కర్నూలుకు తీసుకువచ్చి సీ.క్యాంపు రైతుబజారుకు 120 బాక్సులు, కొత్తపేట, అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజార్లకు 60 బాక్సుల చొప్పున కేటాయించారు. రైతుబజార్లకు వినియోగదారులు పెద్దఎత్తున తరలివచ్చి క్యూలలో నిలబడి సబ్సిడీ టమాటాలను కొనుగోలు చేశారు. సీ.క్యాంపు రైతు బజారులో మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి, సూపరింటెండెంట్ సుజాత, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ పర్యవేక్షణలో టమాట పంపిణీ చేశారు.

వచ్చే నెల 1న స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు

- నోటిఫికేషన్ జారీ చేసిన నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ
- 24 వరకు నామినేషన్ల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటల వరకు స్టాండింగ్ కమిటీకి పోటీ చేసే కార్పొరేటర్లు తమ నామినేషన్లను సమర్పించవచ్చు. 25న ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 3 గంటలకు అభ్యర్థుల జాబితా ప్రదర్శిస్తారు. 28 న మధ్యాహ్నం 3 గంటలకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అదే రోజు పోటీలో నిలిచే అభ్యర్థులను ప్రకటిస్తారు. వచ్చే నెల 1న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలకలోని కౌన్సిల్ హాలులో పోలింగ్ నిర్వహిస్తారు. అక్కడే కౌంటింగ్, అనంతరం ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులను ప్రకటిస్తారు. కాగా నగరపాలక సంస్థలో 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీకి 41 మంది ఉన్నారు. మరో 2 ఇండిపెండెంట్ల మద్దతు ఉంది. తాజాగా మరో ఐదుగురిని స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు ఏడాది పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. మరోసారి సైతం అదే సంప్రదాయం కొనసాగనుంది. ఇప్పటికే 10 మంది కార్పొరేటర్లకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం వచ్చింది. ఈ ఎన్నికల్లో మరో ఐదుగురికి అవకాశం దక్కనుంది. ఆశావాహులు ఎక్కువగానే ఉన్నారు.

వర్షంతో వచ్చే సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు పడుతున్న కారణంగా విద్యుత్ సమస్యలు ఏర్పడే అవకాశాలున్నాయని, సరఫరాలో ఏర్పడే అంతరాయ సమస్యలను పర్కిరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం, గాలి, ఇతర సాంకేతిక సమస్య వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటాయన్నారు. ఈ సమస్యల కారణంగా బ్రేక్ డౌన్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఎగ్జిఫ్యూజ్ పాడవడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. అంతరాయ సమస్యల వినియోగదారులు అసౌకర్యానికి గురవుతారని, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. వీటిపై నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించడమే మన లక్ష్యమనే విషయాన్ని గుర్తించుకొని పని చేయాలని సూచించారు.

31న కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(రూరల్): ఈ నెల 31న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. మంగళవారం పాతబస్తీలోని వివిధ కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, నగర జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ సమస్యను, పారిశుధ్య కార్మికుల కొరతను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 26న ఆదోని నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. 31 జరిగే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు రామకృష్ణ, నాగ స్వాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



మారుతీనగర్‌లో స్థానికుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే చేరవేస్తున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్నూలు నగరంలోని మారుతీనగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, జన్మభూమి కమిటీల పేరుతో జరిగిన దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో టీడీపీ నాయకులంతా పక్క రాష్ట్రాల్లో దాక్కుంటే వలంటీర్లు తమ ప్రాణాలు, కుటుంబాలను సైతం లెక్కచేయకుండా ఫీవర్ సర్వేలతో సేవలందించారన్నారు. అలాంటి వలంటీర్లను అభినందించాల్సిందిపోయి బురదజల్లడం తగదన్నారు. మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గిప్సన్, సాంబ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా

కర్నూలు(సెంట్రల్): ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం రాత్రి విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎలక్ట్రోల్ రోల్‌లో రెండు శాతం కంటే ఎక్కువ డిలిషన్స్ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి దరఖాస్తును ఈఆర్వోలు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ ఒకే ఇంట్లో పది కంటే ఎక్కువ మంది ఉన్న ఓటర్ల శాతాన్ని సవరించామన్నారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల లిస్ట్ స్వచ్ఛీకరణ చేస్తారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, అనురాధ, రమ, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.